# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. కీలక వడ్డీ రేట్లను రిజర్వు బ్యాంకు సవరించింది.**

**2. పరీక్షా పే చర్చా కార్యక్రమానికి పేర్ల నమోదులో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా రెండవ స్థానంలో నిలిచింది.**

**3. సాగు ..., తాగు నీటి అవసరాల కోసం కృష్ణా డెల్టా ప్రాంతానికి నీటి పారుదల శాఖ 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది**

**4. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో "" సుగమ్య భారత యాత్ర "" కార్యక్రమాన్ని ఈ రోజు ఒంగోలు లో నిర్వహించారు.**

**5. పిల్లలలో నులి పురుగుల నివారణ కోసం ఈ నెల పదవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరగనున్నది.**

==========================

భారతీయ రిజర్వు బ్యాంకు నిర్వహించిన ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో కీలక వడ్డీ రేట్లను సవరించింది. ఆ వివరాలను ఆర్ బి ఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ రోజు వెల్లడించారు.

రెపోరేటును 25 బేసిక్ పాయింట్లు తగ్గిస్తూ సమవేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో రెపో రేటు 6.50 శాతం నుండి 6.25 శాతానికి తగ్గింది. రెండేళ్ల తరువాత వడ్డీ రేట్లను సవరించడం ఇదే మొదటి సారి. 2023 వ సంవత్సరం మే నెల తరువాత నుండి కీలక వడ్డీ రేట్లను రిజర్వు బ్యాంకు యథాతథంగా ఉంచుతూ వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉండవచ్చునని ...., 2025 - 26 సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.2 శాతంగా నమోదు కావచ్చునని ఆయన తెలిపారు. వాణిజ్య బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగుగా ఉందని ..., బ్యాంకుల వద్ద సరిపడా ద్రవ్య లభ్యత ఉందని కూడా సంజయ్ మల్హోత్రా వివరించారు.

-------------------------

విద్యార్థులలో పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమానికి పేర్ల నమోదులో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఒక లక్షా 25 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి లోని ఎస్.ఎన్.బి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బృందాదేవి

విద్యార్థి కీర్తన ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ ....

(వాయిస్ 44 )

---------------------------

కృష్ణా డెల్టా ప్రాంతానికి సాగు ..., తాగు నీటి అవసరాల నిమిత్తం విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ నుండి నిన్న 5 వేల 647 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఇందులో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3 వేల 631 క్యూసెక్కులు ..., కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు ఒక వెయ్యి 818 క్యూసెక్కులు ....., గుంటూరు చానల్ కు 198 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం .... ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉండవలసిన 12 అడుగుల నీటి మట్టానికి గాను 11.8 అడుగులు ఉండగా ...., పులిచింతల ప్రాజెక్టులో 45.77 టి.ఎం.సి. లకు గాను 37.23 టి.ఎం.సి. ల నీటి లభ్యత ఉంది..

---------------------------

నీతి అయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ బేరి ఈ రోజు వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ..., వికసిత ఆంధ్ర ప్రదేశ్ – 2047 ...., రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ ..., అభివృద్ధి పథకాలపై వారు చర్చించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షల హాల్ టికెట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ..... 95523 00009..... అన్న వాట్స్ అప్ నంబర్ ద్వారా హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

ఇలా ఉండగా ... ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి ఒకటవ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి ఒకటి నుండి 19 వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ..., మార్చి 3 నుండి 20 వ తేదీ వరకు రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి.

మరొక వైపు ... పదవ తరగతి విద్యార్థులు కూడా వాట్స్ అప్ ద్వారా హాల్ టికెట్లు పొందేందుకు విద్యా శాఖ కృషి చేస్తోంది.

---------------------------

విజయవాడ రైల్వే డివిజన్ లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా రేపు పలు రైళ్ళను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన రైళ్లలో రాజమండ్రి – విజయవాడ ...., విజయవాడ – రాజమండ్రి ...., కాకినాడ పోర్టు – విజయవాడ ...., విజయవాడ – కాకినాడ పోర్టు ఉన్నాయని ..., ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందిన జన సేన పార్టీకి తెలంగాణా రాష్ట్రంలో కూడా గుర్తింపు ఇవ్వడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి గాజు గ్లాసు గుర్తును కేటాయిస్తూ తెలంగాణా రాష్ట్ర ఎన్నికల సంఘం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం జన సేన పార్టీని ఆంధ్ర ప్రదేశ్ లో ప్రాంతీయ పార్టీగా గుర్తించి నందున..., తెలంగాణా రాష్ట్రంలో కూడా గుర్తించి గాజు గ్లాసు ఇవ్వాలని ఆ పార్టీ

ఇటీవల రాసిన లేఖ మేరకు ఈ అనుమతి ఇస్తూ తెలంగాణా ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమని విభిన్న ప్రతిభావంతుల శాఖ రాష్ట్ర డైరక్టర్ రవిప్రకాష్ రెడ్డి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ఏర్పాటు చేసిన సుగమ్య భారత్ యాత్రను ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులకు అవరోధరహిత మార్గం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా యాత్ర నిర్వహిస్తున్నామని తెలుపుతూ..

(వాయిస్..31 )

---------------------------

పిల్లలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్ కల్పించడం కోసం దేశ వ్యాప్తంగా ఈ నెల 10 వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ.., రాష్ట్రాల ఆరోగ్య మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు నిన్న ఆవిష్కరించారు.

---------------------------

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఈ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.. శైలజానాథ్‌తో పాటు , అనంతపురం డీసీసీ మాజీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఈ సందర్భంగా శైలజానాథ్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అవలంబిస్తోందని విమర్శించారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావలసిన నిధుల వివరాలపై తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

ఈ మేరకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నిన్న ఆయన ఒక లేఖ రాస్తూ .... కేంద్ర ప్రభుత్వ నిధుల విడుదల విషయంలో అస్పష్టత ఉంటోందని ..., అందువల్ల ... ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సరైన వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈరోజు

దర్శించుకున్నారు. ఈ ఉదయం విఐపి విరామ సమయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

---------------------------

ప్రముఖ తెలుగు సాహితీవేత్త .., ప్రాచీన వాఙ్మయ పరిశోధకులు వేటూరి ప్రభాకర శాస్త్రి జయంతి ఈ రోజు. కృష్ణా జిల్లా దివిసీమలోని పెదకల్లెపల్లి గ్రామంలో 1888 ఫిబ్రవరి 7 వ తేదీన జన్మించిన ఆయన తన పన్నెండవ ఏటనే పద్యాలు రాయడం ప్రారంభించారు. 1950 వ సంవత్సరం ఆగస్టు 29 వ తేదీన తుది శ్వాస విడిచిన వేటూరి ప్రభాకర శాస్త్రి ..... తెలుగు భాషలో అనేక కావ్యాలు రచించారు. అనేక అంశాలకు అనువాదాలు ..., వివరణా గ్రంథాలు కూడా ఆయన రాసారు.

======================